క్లుప్తంగా

రెవెన్యూ సేవల్లో అలసత్వం వద్దు

చీరాల టౌన్: రెవెన్యూ సేవలను సత్వరంగా అందించడంతో పాటు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కుర్రా గోపికృష్ణ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా నీటి తీరువా వసూళ్లను త్వరగా చేయడంతో పాటు వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన అర్జీలను విచారించి త్వరగా పత్రాలు మంజూరు చేయాలన్నారు. గ్రామాల వారీగా ఓటీఎస్ వివరాలు, పెండింగ్ అర్జీలపై విచారించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలని ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశించిన సమయానికి పూర్తి చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. రెవెన్యూ సిబ్బంది విధుల్లో అశ్రద్ధ వహించినా, అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌ఐలు సత్యం, శేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

రుణాల సద్వినియోగంతో అభ్యున్నతి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలని ఏపీఎం కె.మధుసూదనరావు సూచించారు. బుధవారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవన ంలో మండల సమాఖ్య సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధి పెంచేలా పొదుపు సంఘాల మండల సమాఖ్య వీఏవోలు చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ లేకుండా గ్రూపు లీడర్లు కృషి చేసేలా వీఏవోలు గ్రూపును పరిశీలించాలన్నారు. మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

ఘనంగా తిలక్, చంద్రశేఖర ఆజాద్ జయంతి



తిలక్, ఆజాద్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం స్వాతంత్ర సమరయోధుడు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని రోటరీక్లబ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు, సెక్రటరీ అలహరి ప్రసాద్, ట్రెజరర్ గురుశేఖర్, యు.దేవపాలన, అద్దంకి లెవీ ప్రసాద్, తమ్మన శ్రీనివాసరావు, అంజాద్‌బాషా పాల్గొన్నారు.

కన్నీటి వెతలు!

● కొప్పరపాడులో మూలన పడిన బోర్లు ● అలంకారప్రాయంగా మారిన రక్షిత పథకం



పని చేయని రక్షిత పథకం



కొప్పరపాడులో మంచినీటి బోర్ చుట్టూ వ్యర్థాలు



తుప్పుపట్టి పని చేయని బోరు

బల్లికురవ: 'ఎంతో మందికి దాహం తీర్చాం. వేసవిలో నీటిఎద్దడి నివారించాం. భూగర్భంలోని నీటిని పైకి తెచ్చి బిందెలకు నింపాం. ప్రస్తుత పాలకులు మమ్మల్ని నిరుపయోగంగా మార్చేశారు. నెలల పాటు ఇలాగే ఉండి బోరు కొడుతోంది. మేము వినియోగంలో లేక పోవడంతో మా చుట్టూ వ్యర్థాలు, కవర్లు పడవేస్తున్నారు. దిష్టిబొమ్మలా నిలిచిన మాకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తే మీకే ఉపయోగం' ఇలా వినియోగంలో లేని బోర్లు ఆక్రోశిస్తున్నాయి. బల్లికురవ మండలంలోని కొప్పరపాడు గ్రామం మండలంలోని మంచి నీటి బోర్లు నిరుపయోగంగా మారడంతో ప్రజలకు కష్టాలు తప్పటంలేదు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో రెండు బోర్లు, మసీదు సెంటర్‌లో ఒకటి, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలో ఆరు బోర్లు ఉండగా అవన్నీ పని చేయడం మానేశాయి. వైదన గ్రామం నుంచి గ్రామానికే సురక్షిత మంచి నీరు అందిచేందుకు రెండు దశాబ్దాల క్రితం రక్షిత పథకాన్ని ఏర్పాటు చేశారు. పైపులైన్‌లో సాంకేతిక లోపాలతో అలంకార ప్రాయం అయింది. అధికారుల దృష్టికెళ్తే మరమ్మతులు చేస్తే రెండురోజులు నీరు అందిస్తారని గ్రామస్తులు పరిటాల పవన్, దానా నాయక్ తెలిపారు. బోర్లకు మరమ్మతులతోపాటు రక్షిత పథకం ద్వారా నీరు నిరతరంగా అందించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

పాలకుల మధ్య విభేదాలు

గ్రామ పంచాయితీ పాలకుల మధ్య విభేదాలతో సంవత్సరం నుంచి గ్రామం అభివృద్ధికి నోచుకోటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్పంచ్–ఉపసర్పంచ్ పాలకవర్గాన్ని సమన్వయ పరచాల్సిన అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ కుసుమకుమారిని వివరణ కోరగా బోర్లు మరమ్మతులకు గురైన విషయాన్ని తమ దృష్టికి తేలేదన్నారు. పాలకుల మధ్య విభేధాల వల్ల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని సర్పంచ్, ఉపసర్పంచ్ పాలక వర్గం మధ్య చర్యలు జరిపామని ఫలితం లేదని చెప్పారు.

గంగమ్మ తల్లికి సారె



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



గంగమ్మతల్లికి సారెను అందించేందుకు తరలివస్తున్న మహిళలు

కారంచేడు: గ్రామదేవతగా విరాజిల్లుతున్న గంగమ్మతల్లికి భక్తులు పెద్ద ఎత్తున సారెలు, పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు. ఆషాఢమాసం బుధవారం అమ్మవారిని దర్శించుకొని అమ్మవారికి సారెను అందించడం కోసం గ్రామానికి చెందిన పెయ్యల, వాకా, మద్దిన వారి ఇంటి నుంచి ఆడపడుచులు పసుపు, కుంకుమలతో అమ్మవారిని దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచి ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన భక్తులు ఇంటి వద్ద నుంచి తీసుకువచ్చిన సారెను, పొంగళ్ళను అందించారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులతో పూజలు చేయించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం ఆషాఢ మాసం పునర్వసు నక్షత్రం అమవాస్య సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు బుధవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నేడు అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అన్న ప్రసాదం

అద్దంకి రూరల్: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అద్దంకి శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నప్రసాదం నిర్వహించనున్నారు. ఈమేరకు అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అద్దంకి శాఖ సభ్యులు బుధవారం తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

ఈకేవైసీ చేయించుకోండి

జరుబులవారిపాలెం (కారంచేడు): అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం నుంచి అందించే పథకాలను పొందేందుకు అవసరమైన ఈ–కేవైసీలను త్వరగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎం. నాగరాజు అన్నారు. బుధవారం జరుబులవారిపాలెంలో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు వెంటనే ఈ–కేవైసీలపై దృష్టి పెట్టాలన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): రాబోయే రబీ సీజన్‌లో రైతులు పొగాకు సాగు జోలికి పోవద్దని మండల వ్యవసాయాధికారి ఎస్. మేరిమ్మ సూచించారు. బుధవారం గొల్లపాలెం, ఇడుపులపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. శనగలో ఎండుతెగులు నివారణ, మొక్కజొన్నలో ఎరువుల యాజమాన్యం గురించి తెలియజేశారు.

పంట నమోదు తప్పనిసరి

అద్దంకి: ప్రతి రైతు సాగు చేసిన పంటను నమోదు చేసుకోవడం తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి కొ్రపాటి వెంకట కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని కొటికలపూడి, కుకంపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

బల్లికురవ: ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం వేమవరం, కొప్పరపాలెం గ్రామాల్లో రైతులతో మాట్లాడారు.



కొడవలివారిపాలెంలో అవగాహన కల్పిస్తున్న శక్తిటీం ఇన్‌చార్జి హరిబాబు, ఎస్ఐ ఖాదర్‌బాషా

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

కొడవలివారిపాలెం (కారంచేడు): నేటి సమాజంలో బాలికలపై జరుగుతున్న ఘోరాలను అరికట్టేలా బాలికలు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందని శక్తి టీం ఇన్‌చార్జి, ఎస్ఐ ఏ. హరిబాబు, కారంచేడు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషాలు అన్నారు. బుధవారం కొడవలివారిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐలు బాలబాలికలకు అనేక విషయాలపై అవగాహన కల్పించారు. బాపట్ల ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ మొయిన్ సూచనలతో చీరాల సబ్ డివిజన్ పరిధిలో శక్తిటీం నిరంతరం పనిచేస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బాలబాలికల చేతుల్లో సెల్‌ఫోన్‌లు ఉంటున్నాయని, వాటని అవసరమైన మేరకు మాత్రమే వినియోగించాలన్నారు. సెల్‌ఫోన్‌లో వచ్చే ప్రమాదకమైన యాప్‌లను ఆపరేట్ చెయ్యడం వలన ఎన్నో సమస్యలు వస్తాయని హెచ్చరించారు. బాలికల ఫేస్‌లను అసభ్యకరమైన ఫొటోలుగా మార్చి నెట్‌లో పెట్టే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఏ. ఉమామహేశ్వరరావు, శక్తి టీం సభ్యులు లోకేష్, సుబ్బారావు, సునీత, వరలక్ష్మి పాల్గొన్నారు.

చినగంజాం: విద్యార్థి దశ నుంచి విద్యార్థులు నేర ప్రవృత్తి చర్యలకు దూరంగా మసలుకోవాలని ఎస్ఐ శీలం రమేష్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇన్‌స్టాగ్రాం, ఫేస్ బుక్, వాట్స్ అప్ వంటి మీడియాలను సద్వినియోగం చేసుకోవాలే తప్ప తప్పుడు మార్గాల్లోకి వెళ్లి జీవితాలను పాడు చేసుకోవద్దని హెచ్చరించారు. ఉపాధ్యాయులు ఎస్. నరసింహారావు, శ్రీలక్ష్మి, కుమార్, సుబ్బారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



చినగంజాం: మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్, పాఠశాల సిబ్బంది

టీబీ ముక్తభారత్ లక్ష్యం క్షయ నిర్మూలన



కారంచేడులో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కారంచేడు: సమాజంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే టీబీ ముక్తబారత్ ప్రధాన లక్ష్యమని బాపట్ల జిల్లా క్షయ ల్యాబ్ సూపర్‌వైజర్ టి. నరేంద్రబాబు అన్నారు. బుధవారం కారంచేడు గ్రామంలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. టీబీ అంటు వ్యాధి అన్నారు. ఈ వ్యాధి ఎక్కువగా అధిక జనాభా నివసించే ప్రాంతాలు, మురికివాడలు, పౌష్టికాహార లోపంతో ఉండేవారికి వ్యాపించే ప్రమాదముందని తెలిపారు. ఈ వ్యాధి సోకిన వారు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వారి తుంపర్ల ద్వారా గాలిలో సూక్ష్మక్రిములు ఇతరులకు వ్యాపిస్తుందని చెప్పారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, జ్వరం రావడం , సాయంత్రం సమయంలో చెమటలు పట్టడం, ఛాతీలో నొప్పి, ఆయాసం, క్రమేణా బరువు తగ్గడం, ఆకలి మందగించడం, అలసట, శరీరంలోని ఇతర బాగాల్లో కణుతులు, గడ్డలు రావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే మీ సమీప ఆసుపత్రికి వెళ్ళి పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ సూపర్‌వైజర్ నీలిమ, ఎంఎల్‌హెచ్‌పీ శాంతిప్రియ, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



అసంపూర్తిగా తీసి ఉంచిన కాలవలో నిలిచిన మురుగు

గాలిలో దీపం.. ప్రజారోగ్యం

- వేటపాలెంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- రూ. 2 కోట్లు నిధులు మట్టి పాలు
- మూడేళ్లుగా నిలిచి పోయిన డ్రైనేజీ పనులు
- పూడుకు పోయిన డ్రైనేజీ కాలవలు
- దోమలకు ఆవాస కేంద్రాలుగా మారిన వైనం

వేటపాలెం: మండల కేంద్రం వేటపాలెంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైయింది. మూడేళ్ల క్రితం జాతీయ ఉపాధి హామీ నిధులు రూ. 3 కోట్లతో ప్రారంభించిన డ్రైనేజీ పనులు.. అధికారులు నిర్లక్ష్యం కారణంగా మధ్యలోనే నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ 50 శాతం పనులు పూర్తిచేసి వదిలేశాడు. దీంతో ప్రస్తుతం కోటి పైగా పెట్టి నిర్మించిన డ్రైనేజీల్లో నీరు పారుదల లేక ఎక్కడ మురుగు నీరు అక్కడే నిలిచి పోయి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారిపోయాయి. రూ. 1.50 కోట్లు నిధులు నిర్మించిన డ్రైనేజీ కాలవలో కొంత భాగం మట్టి నిండి పూడి పోగా మరి కొంత భాగం చెట్లు, పుట్టతో నిండి పాములకు ఆవాసాలుగా మారాయి. రోడ్డు వెంట తీసిన డ్రైనేజీ గుంటలకు ఇప్పటికీ అదేవిధంగా ఉండి పోయాయి. ఈ గుంతల్లో పశువులు, మనుషులు ప్రమాదవ శాత్తు పడి వైద్యశాల పాలయిన సంఘటనలో అనేకం ఉన్నాయి. రెండేళ్ల క్రితం ఇలాంట ఓ భారీ గుంతలో పడి వ్యక్తి మృతి చేందాడు. రెండు నెలల క్రితం పోలీస్ స్టేషన్ ముందు డ్రైనేజీ కోసం తీసిన గుంతలో పశువు పడి అందులోని ఇనుప చువ్వలు గుచ్చుకొని తీవ్రగాయాల పాలయింది.

పర్సంటేజీలకే ప్రాధాన్యత

మండల, గ్రామ స్థాయి అధికారులు శాశ్వత ప్రాతిపదికన రూ. 3 కోట్లు నిధులతో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీని పట్టించు కోకుండా కేవలం పర్సం టేజీలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఏడాదిన్నర క్రితం గ్రామంలో రూ. 5 లక్షల వ్యయంతో ఒకోక్కటి రూ. 25 వేల వ్యయంతో రోడ్ల పక్కన ఇంకుడు గుంతలు తీశారు. ఇవి నెల తిరక్క ముందు భారీ వర్షానికి నిడిపోయి దోమల ఆవాశాలుగా మారి పోయాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులతో పాటు డెంగీ, మలేరియా జ్వరాల పై ప్రజలు ఆందోళన చెదుతున్నారు.



బీబీహెచ్ జూనియర్ కళాశాల వద్ద ప్రధాన రహదారిలో వర్షానికి నిలిచిన నీరు

దేవాలయ భూముల వేలం పాట రేపు

జె.పంగులూరు: మండల పరిధిలోని రామకూరు గ్రామంలో గల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 21.31 ఎకరాల భూమి కౌలు బహిరంగ వేలం పాట శుక్రవారం రామకూరు గ్రామంలోని గ్రామపంచాయితీ కార్యాలయంలో జరుగుతుందని ఏఓ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామకూరు గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 136 లో 12 ఎకరాలు, సర్వే నెంబర్ 149 లో 8.31 ఎకరాలు మెట్టభూమి కౌలు వేలం జరుగుతుందని తెలిపారు. ఈ కౌలు 2025–26 నుంచి 2027–28 వరకు రెండు సంవత్సరాల పాటు కాలపరిమితి ఉంటుందని తెలిపారు. గతంలో బాకీ ఉన్నవారు, లావాదేవీలు ఉన్నవారు, ఈ పాటలో పాల్గొనవద్దని తెలిపారు. రూ. 5 వేలు ధరావత్తు చెల్లించాలని తెలిపారు.

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామంలోని మూడు ఆలయాలకు సంబంధించిన 80 ఎకరాలకు గురువారం ఉదయం 10 గంటలకు గ్రామంలోని శంకర స్వామి ఆలయం వద్ద కౌలు వేలం నిర్వహించనున్నారు. ఈమేరకు దేవాదాయ శాఖ ఇన్‌చార్జి ఈవో శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకర స్వామికి 36 ఎకరాలు, వేణుగోపాల స్వామికి 12 ఎకరాలు, చెన్నకేశవ స్వామికి 32 ఎకరాల భూములకు సంబంధించి 23 ప్లాట్‌లుగా విభజించినట్లు చెప్పారు. రూ. 5 వేలు ధరావత్తు చెల్లించి కౌలు వేలం పాటలో పాల్గొనవచ్చని.. పాట పూర్తి కాగానే హెచ్చుపాటదారుడు సొమ్ము చెల్లించాలని వివరించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్విశెట్టి సుబ్బరామయ్య

అపురూప ప్రసార మాధ్యమం ఆకాశవాణి

చీరాల అర్బన్: దేశవ్యాప్తంగా అంద రికీ అందుబాటులో ఉండి వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచే అపురూప ప్రసార మాధ్యమం ఆకాశవాణి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో జాతీయ ప్రసార దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి బీరం సుందరరావు అధ్యక్షత వహించారు. గత 75 సంవత్సరాలుగా సంపన్నుల నుంచి సామాన్యుల వరకు రేడియో ప్రసారాలు అందరినీ అలరిస్తున్నాయన్నారు. సాంకేతిక విప్లవం ఆధర్యంలో రేడియోను మళ్ళీ యువతరానికి పరిచయం చేయాలని వక్తలు సూచించారు. వి.కె.భాస్కరరావు, పి.శివాంజనేయప్రసాద్, వడలి రాధాకృష్ణ, సరిశెట్టి సుబ్బరామయ్య, డీఎస్ఆర్ ఆంజనేయులు, భాగి కృష్ణమూర్తి, కనకలింగేశ్వరరావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, డి.ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.